క్లుప్తంగా

డిగ్రీ కళాశాలకు దివీస్ చేయూత



చెక్కును ప్రిన్సిపాల్ శ్రీవాణికి అందిస్తున్న దివీస్ ప్రతినిధి శ్రీనివాస్

భీమునిపట్నం: తగరపువలసలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చిప్పాడ దివీస్ ల్యాబొరేటరీ గురువారం ఆర్థిక సహకారం అందించింది. ఆంధ్ర విశ్వవిద్యాలయానికి ఈ విద్యా సంవత్సరానికి అనుబంధ రుసుము కింద రూ.1.65లక్షలు కట్టవలసి ఉండగా, నిధుల కొరత వల్ల ఇబ్బంది ఏర్పడింది. దీనిపై కళాశాల ప్రిన్సిపాల్ పి.శ్రీవాణి దివీస్ యాజమాన్యాన్ని సంప్రదించడంతో వారు సానుకూలంగా స్పందించారు. కంపెనీ సీఎస్ఆర్ ఇన్‌చార్జి ఎ.శ్రీనివాస్ గురువారం కళాశాలకు వచ్చి, కట్టవలసిన రుసుమును చెక్కు రూపంలో ప్రిన్సిపాల్ శ్రీవాణికి అందించారు. దివీస్ ప్రతినిధి మాట్లాడుతూ కళాశాల నిర్వహణకు ఇబ్బంది రాకుండా తమ వంతు సహకారం అందించామన్నారు. దివీస్ అందించిన సాయానికి ప్రిన్సిపాల్ శ్రీవాణి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులకు సామూహిక సీమంతం



బిడ్డ తల్లికి పౌష్టికాహారం అందిస్తున్న అధికారులు

తగరపువలస: ఐసీడీఎస్ భీమిలి ప్రాజెక్ట్ పరిధిలోని ఆనందపురం మండలంలోని ఐసీడీఎస్ హాల్లో గురువారం మండల స్థాయి పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గర్భిణులకు సామూహిక సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసనలు చేశారు. పీడీవో వి.జానకి మాట్లాడుతూ బరువు తక్కువగా ఉన్న పిల్లల తల్లులకు పౌష్టికాహారం గురించి, పరిశుభ్రత, ఫుడ్‌క్వాలిటీ, క్వాంటిటీ వంటి పలు విషయాలపై అవగాహన కల్పించారు. వెయ్యి రోజుల ప్రణాళిక (గర్భస్థ దశ నుంచి బిడ్డకు రెండు సంవత్సరాల వరకు) గురించి వివరించారు. కార్యక్రమంలో సీడీపీవో ఎం. శ్రీదేవి, డీటీ చేతన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం



దేవిడ్ (ఫైల్)

పీఎం పాలెం: మానసిక వేదనకు గురైన ఓ యువకుని అదృశ్యంపై పీఎం పాలెం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఇందుకు సంబంధించి స్థానిక సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాలివి.. ఎండాడ బీసీ కాలనీలో పిసిని ఆదిలక్ష్మి కుటుంబంతో నివసిస్తున్నారు. ఆమె కుమారుడు పిసిని దేవిడ్(20) ఇంటర్ చదువుతూ మధ్యలో మానేశాడు. కొంతకాలంగా ఇంటివద్దనే ఉంటున్నాడు. షేర్ మార్కెట్‌లో పెట్టుబడి పెడితే అధికంగా లాభాలు వస్తాయని తెలిసిన వ్యక్తులు చెప్పడంతో షేర్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టి రూ.6లక్షల వరకు నష్టపోయాడు. అప్పటి నుంచి మానసిక వేదనకు గురయ్యాడు. ఈ క్రమంలో ఈ నెల 16వ తేదీ ఉదయం 10 గంటలకు ఇంటి నుంచి వెళ్లి, మరలా తిరిగి రాలేదు. మొబైల్ స్విచ్ఛాఫ్‌లో ఉంది. చుట్టుపక్కల గాలించినా ఫలితం లేకపోవడంతో దేవిడ్ తల్లి ఆదిలక్ష్మి పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

పారిశుధ్య కార్మికుల ఆందోళన



ఆందోళన చేస్తున్న పారిశుధ్య కార్మికులు

భీమునిపట్నం: పారిశుధ్య కార్మికుల విషయంలో ప్రభుత్వం స్పందించి, వారికి కనీస వేతనాలు అమలు చేయాలని సీఐటీయూ నాయకులు ఆర్.ఎస్.ఎన్.మూర్తి కోరారు. భీమిలి జోన్ కార్యాలయం వద్ద పారిశుధ్య కార్మికులు గురువారం నిర్వహించిన ఆందోళన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వీరికి జీవో 36 ప్రకారం అందవలసిన కనీస వేతనాలను అమలు చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయాలను కల్పించాలని కోరారు. ఎంతోకాలంగా ఉన్న ఖాళీలను భర్తీ చేయాలని, ఉద్యోగ విరమణ వయస్సు 62 ఏళ్లుగా నిర్ణయించాలని, ఇతర సమస్యలను కూడా త్వరలో పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.అప్పలనాయుడు, రవ్వ నర్సింగరావు, సురేష్, చిన బాబు, శ్రీను, జగన్నాథం పాల్గొన్నారు.

అ.. అరటి ఆ.. ఆదాయం



బోయపాలెంలో అరటితోట

- సిరులు కురిపిస్తున్న అరటి పంట
- రోజుకు రూ.5 లక్షల నుంచి రూ.12 లక్షల వ్యాపారం
- అటు ఆరోగ్యం.. ఇటు ఆదాయం

రోజుకో ఆపిల్ తింటే డాక్టర్ వద్దకు వెళ్లవలసిన అవసరం లేదని చెప్పే సూత్రం అరటిపండుకూ వర్తిస్తుంది. **అన్ని సీజన్‌లలో చవకగా లభించే అరటిపండును కదళీఫలం పేరుతో దేవుడికి నైవేద్యంగా సమర్పిస్తుంటారు. అటువంటి అరటిపండు భీమిలి నియోజకవర్గంలోని పలు గ్రామాల ప్రజలకు ఆరోగ్య సిరిని, రైతులకు ఆదాయ సిరిని అందిస్తోంది.**



కూర అరటి

తగరపువలస: అరటి పంట రైతులకు మంచి ఆదాయాన్ని అందిస్తోంది. భీమిలి నియోజకవర్గంలో బోయపాలెం, తాళ్లవలస, కోరాడ, దుక్కవానిపాలెం, తర్లువాడ, కల్లివానిపాలెం, మచ్చవానిపాలెం, గుడిలోవ, పాలవలస, గారిపేట, చిప్పాడ, ఆశిపాలెం, తాటితూరు, గెద్దపేట, పాత పరదేశిపాలెం తదితర గ్రామాలలో సుమారు 300 హెక్టార్లలో పండిస్తున్నారు. చిన్నాపెద్ద వందలాది మంది రైతులు అరటిని సాగు చేస్తున్నారు. పెరటిలో నాటిన అరటిచెట్టును కూడా కొబ్బరిచెట్టులాగానే కల్పవృక్షంగా భావిస్తున్నారు. కొన్ని సార్లు స్థానిక అవసరాల కోసం విజయనగరం జిల్లాలోని మెంటాడ, ఆంధ్ర, గజపతినగరం, గోదావరి జిల్లాలలో రావులపాలెం, ఏలేశ్వరం, కత్తిపూడి తరువాత వైఎస్సార్ కడప జిల్లాలోని పులివెందుల నుంచి కూడా దిగుమతి చేసుకుంటారు.



పెడలు సిద్ధం చేస్తున్న రైతు

అనేకమందికి ఉపాధి



విక్రయానికి అరటి పెడలు

సాధారణ రోజుల్లో నియోజకవర్గంలో రోజుకు 200 గెలలు విక్రయం కాగా పెళ్లిళ్లు, పండగ సీజన్‌లో 500 గెలలు వరకు అవసరం అవుతుంటాయి. నిత్యం అరటి వ్యాపారం కారణంగా రైతులే కాకుండా వ్యాపారులు, రవాణా, కూలీలకు ఉపాధి దొరుకుతుంది. దీంతో రోజూ రూ.5 లక్షల నుంచి రూ.12 లక్షల వ్యాపారం జరుగుతుంది. నియోజకవర్గంలో దేశవాళి, ముకిరి, ఎర్ర ముకిరి, గిన్నె, బుసావాల్, గోసావాల్, కూర అరటి, కొమ్మ అరటి, చక్కెరకేళి, కర్పూరం వంటి వెరైటీలు అందుబాటులో ఉన్నాయి.

సాగు.. అలా మొదలైంది..

ఒంట్లో పేరుకుపోయిన మలినాలను బయటకు పంపించి, తక్షణం పోషకాలు అందించే గుణం అరటిలో ఉంది. వందల ఏళ్ల క్రితం చిట్టివలస జ్యూట్‌మిల్లులో ఉత్పత్తి ప్రారంభమైనప్పుడు పనిప్రదేశంలోని కార్మికుల ఒంట్లోకి గోగుపీచు, ధూళి ప్రవేశించడంతో క్షయవ్యాధి బారిన పడేవారు. ఆ పీచు ధూళి మల విసర్జన ద్వారా బయటకు రప్పించేందుకు అరటిపండును తినాలని వైద్యులు సూచించేవారు. తద్వారా వ్యాధి నుంచి త్వరగా కోలుకోవచ్చని రుజువు చేశారు. దీంతో భవన నిర్మాణ కార్మికులు, కూలీలు, ఫార్మా కంపెనీలలో పనిచేసేవారికి అరటి పండు వరంలా మారింది. ఆ కారణంతోనే ఆ రోజుల్లో భీమిలి చుట్టుపక్కల ప్రాంతాలలో అరటి సాగుకు బీజం పడింది. అందుకే కూలిపనులు చేసుకునే వారికి ఆరోగ్యప్రదాయిని అయిన అరటి రైతులకు, వ్యాపారులకు ఆదాయప్రదాయిని అయింది. గతంలో ఆర్టీసీ బస్సులలో ప్రయాణించేవారికి కూడా వీటిని పెడలుగా కోసి విక్రయించేవారు. ఏడాదిలో రెండు సార్లు దిగుబడికి వచ్చే అరటిని ఎకరానికి 600 చెట్లు నాటుకుంటే ప్రతిరోజూ నాలుగైదు గెలల ద్వారా ఆదాయం పొందవచ్చు. వారానికోసారి నీరు, యూరియా, గ్రోమోర్, పటాస్ వంటివి వేస్తే సరి.

రోజూ రెండు గెలలు గ్యారంటీ



దిగుబడి ఇచ్చే చెట్టే మళ్లీ పిలక వేస్తుంది. లెక్క ప్రకారం చూసుకుంటే మాకు ఉన్న 30 సెంట్ల భూమిలో రోజూ రెండు గెలలు వస్తాయి. వీటిని గెలల పళంగా అమ్మే కంటే మార్కెట్‌లకు వెళ్లి పెడలు, డజన్లుగా అమ్ముకుంటే రూ.800 నుంచి రూ.1200 సంపాదించచ్చు

– సీర గంగ, బోయపాలెం

పండగ సీజన్‌లో మంచి ఆదాయం



అరటికి ప్రతిరోజూ డిమాండ్ ఉంటున్నా ముఖ్యంగా శ్రావణ, భాద్రపద, ఆశ్వయుజ, కార్తీక, మార్గశిర మాసాలలో ఎక్కువగా డిమాండ్ ఉంటుంది. ధనుర్మాసంలో కూడా అరటి వినియోగం ఎక్కువ కాబట్టి రైతుకు, వ్యాపారులకు కూడా డిమాండ్ ఉంటుంది.

– తెడ్లాపు గోవింద్, బోయపాలెం

పందుల బెడద ఎక్కువ



అరటికి ప్రధాన శత్రువు పందులు. కూకటివేళ్లతో పెకలించి చెట్ల కాండాలను తినేస్తున్నాయి. స్థానిక ప్రభుత్వాలు పందులను అరికట్టలేకపోతున్నాయి. తీవ్రమైన గాలులు కూడా అరటికి నష్టాన్ని కలిగిస్తున్నాయి.

– వెంపాడ శ్రీనివాసరెడ్డి, బోయపాలెం

ఎంతోమందికి ఉపాధి



అరటి సాగు చేసే రైతు వలన తోటలో పనిచేసే కూలీలకు, గెలలు మార్కెట్‌కు తరలించే ఆటోలు మొదలుకుని వ్యాన్‌లు, కలాసీలకు, రిటైల్ వ్యాపారులకు ప్రతిరోజూ పని దొరుకుతుంది. అరటిమొక్కలను, గెలలను అలంకరణకు కూడా వినియోగిస్తారు. అరటి పువ్వును కూరగా చేసుకుని తింటారు. ఇది మంచి ఔషధంగా పనిచేస్తుంది.

– ఇల్లిపిల్లి పైడయ్య, దుక్కవానిపాలెం

నీటి పొదుపు భవిష్యత్తుకు మదుపు



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న హెచ్‌ఎం రవి

మధురవాడ: నీటి వృథా భవిష్యత్‌కు ఎంతో నష్టం కలిగిస్తుందని చంద్రంపాలెం జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం రవి అన్నారు. జల్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా ఎకో క్లబ్ మిషన్ లైఫ్ ఆధ్వర్యంలో పాఠశాలలో గురువారం నీటి పొదుపుపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నీటిని పొదుపు చేయడం అంటే భావితరాలకు ఎంతో మేలు చేయడమన్నారు. జల పక్షోత్సవాలలో భాగంగా నీటి పొదుపు, నీటి కాలుష్యం, నీటి పొదుపు ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయుల చేత నీటి పొదుపుపై ప్రతిజ్ఞ చేయించారు. అంతా ప్లకార్డులు ప్రదర్శించి నీటి పొదుపు ఆవశ్యకతపై నినాదాలు చేశారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విస్తృతంగా వాహనాల తనిఖీ

మధురవాడ: పీఎం పాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు రాత్రి 9 గంటల నుంచి 11గంటల వరకు విస్తృతంగా వాహనాలు తనిఖీ చేశారు. కార్‌షెడ్ జంక్షన్‌లో సీసీఎస్ సీఐ కె.రవికుమార్, పీఎం పాలెం ఎస్ఐ భాస్కరరావు, రుషికొండ ఐటీ సెజ్ జంక్షన్ వద్ద పీఎం పాలెం లా అండ్ఆర్డర్ సీఐ బాలకృష్ణ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలపై ధర్నా



మధురవాడ జోనల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

మధురవాడ: దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న మున్సిపల్ కార్మికుల సమస్యలు తక్షణం పరిష్కరించాలని సీఐటీయూ అనుబంధ మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ నాయకుడు ఎంవీ ప్రసాద్ డిమాండ్ చేశారు. మధురవాడ జోనల్ కార్యాలయం దరి అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం కార్మికులతో కలసి ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యలపై ప్రభుత్వం, మున్సిపల్ అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. ఏళ్ల తరబడి కార్మికుల వారసులకు ఇవ్వవలసిన పనులు ఇవ్వడం లేదని, ప్రతి నెలా 1వ తేదీన ఇవ్వాల్సిన జీతాలు ఇవ్వకుండా ఆర్థిక ఇబ్బందులకు గురి చేస్తున్నారని, అన్నారు. యూనియన్ గౌరవాధ్యక్షుడు డి. అప్పలరాజు మాట్లాడుతూ దీర్ఘకాలంగా పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, ఆప్కాస్ రద్దు ఆలోచనను విరమించుకోవాలన్నారు. సీఐటీయూ నాయకులు సీహెచ్ శేషుబాబు, బి.రత్నం, బి.నరసింగరావు, డి.సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ బిందెలతో మహిళల ర్యాలీ



ఆనందపురం ఎంపీడీవో కార్యాలయానికి ఖాళీ బిందెలతో ర్యాలీగా వస్తున్న మహిళలు

మధురవాడ: తమ కాలనీకి తాగునీరు అందించాలని కోరుతూ మహిళలు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. మహిళలు ర్యాలీగా ఎంపీడీవో కార్యాలయానికి చేరుకుని, కార్యాలయం ఎదుట బైఠాయించారు. ఆనందపురం మండల కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న లొడగలవానిపాలెం ఎస్సీ కాలనీకి తాగునీరు అందించాలని కాలనీ వాసులు దళిత సంఘాల ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. ప్రభుత్వానికి, అధికారుల నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినదించారు. మండల దళిత నాయకుడు సియాద్రి రాంబాబు మాట్లాడుతూ గత 40ఏళ్లుగా తాగునీరు లేక కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఎంపీడీవోకు వినతి పత్రం అందజేశారు. దీనిపై స్పందించిన అధికారులు 24గంటల్లో తాగునీరు అందించేందుకు చర్యలు చేపడతామన్నారు. 45 రోజుల్లో ఇంటింటా కుళాయిలు ఏర్పాటు చేస్తామని తెలిపా రు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర దళిత నాయకుడు భాగం గోపాలరావు, బోని సన్నిబాబు, బోని ప్రసాద్, ముకుంద, తులసి, లంక శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

‘జీవితంలో మార్కులే ముఖ్యం కాదు’



మాట్లాడుతున్న సమగ్ర శిక్షా అభియాన్ జీసీడీవో ఖలీషా బేగం

పద్మనాభం: జీవితంలో పరీక్షల మార్కులే ముఖ్యం కాదని సమగ్ర శిక్షా అభియాన్ జిల్లా జీసీడీవో ఖలీషా బేగం అన్నారు. త్వరలో పదో తరగతి పరీక్ష ఫలితాలు విడుదల కానున్నందున మండలంలోని కృష్ణాపురం కస్తూర్బా విద్యాలయంలో ‘పరీక్షల మార్కులే జీవితమా’ అంశంపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆనందపురం, భీమునిపట్నం, పద్మనాభం కస్తూర్బా విద్యాలయాల విద్యార్థినులకు నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. పరీక్షలలో ఒకసారి తప్పినంత మాత్రాన జీవితమంతా కోల్పోయినట్టు కాదన్నారు. ఒకసారి ఉత్తీర్ణులు కాకపోయినా ఎంతో మంది వ్యక్తులు జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించారన్నారు. కెరీర్ అండ్ మెంటల్ హెల్త్ కౌన్సెలర్లు కృష్ణవేణి డి.ఝాన్సీ, ఎస్.మంగమ్మ మాట్లాడుతూ విద్యార్థినులు పరీక్షలు తప్పినా మనోధైర్యం కోల్పోకూడదన్నారు. ధైర్యంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గ్రేస్ లిల్లీ పాల్గొన్నారు.

‘రోడ్డుపై మురుగు’కు తక్షణ పరిష్కారం

జెడ్సీ కనక మహాలక్ష్మి

సాక్షి ఎఫెక్ట్..



మార్కెట్ రోడ్డులో మురుగు ప్రవహించే చోట పనులను పరిశీలిస్తున్న జెడ్సీ కనక మహాలక్ష్మి

మధురవాడ: జీవీఎంసీ 7వ వార్డు మధురవాడ డైలీ మార్కెట్ రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీటి సమస్యకు తక్షణ పరిష్కార చర్యలు చేపడతామని జీవీఎంసీ జోన్–2 జోనల్ కమిషనర్ కె.కనకమహాలక్ష్మి తెలిపారు. ఇక్కడ డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో మురుగుతో స్థానికులు, వాహనదారులు పడుతున్న ఇబ్బందులపై ‘రోడ్డుపై పొంగిపొర్లుతున్న మురుగు’ శీర్షికన బుధవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి ఆమె స్పందించారు. పబ్లిక్ హెల్త్, ఇంజినీరింగ్ శాఖ అధికారులతో కలసి మధురవాడ మార్కెట్ రోడ్డులో శానిటేషన్ పనులను గురువారం పరిశీలించారు. మురుగు, వర్షంనీరు సక్రమంగా పారేందుకు చేపట్టాల్సిన చర్యలపై ఇరు విభాగాల అధికారులతో చర్చించారు. హైవే సర్వీస్ రోడ్డులో భారీ కాల్వలపై పలకలు తొలగించి షిల్ట్ తీసే పనులు చేపట్టాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ సంతోష్‌ని ఆదేశించారు. అలాగే ఇక్కడ కాల్వల ఆక్రమణ, కాల్వలపై బడ్డీల ఏర్పాటు వలన శానిటేషన్ పనులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని, చర్యలు చేపట్టాలని కార్పొరేటర్ భర్త, టీడీపీ నాయకుడు పిళ్లా వెంకటరావు అధికారులను కోరారు. జెడ్సీ వెంట ఏఎంహెచ్‌వో కిషోర్, ఈఈ శాంతిరాజు, ఏఈ శ్రీనివాస్ తదితరులున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తగరపువలస: ఆనందపురం మండలంలో శుక్రవారం పలు చోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. ఈ కారణంగా ఆనందపురం సుఖీభవ లేఅవుట్, పాడుగుపాలెం ఇండస్ట్రియల్ ఏరియా, చందక, ఏనుగుపాలెం, వెంకటాపురం, జగన్నాథపురం, గొట్టిపల్లి, కుసులవాడ ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

రేపటి నుంచి శ్రీవారి లడ్డూ విక్రయాలు

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారి లడ్డూ విక్రయాలు శనివారం నుంచి పునః ప్రారంభం కానున్నాయని ఆలయ ఏఈవో జగన్మోహనాచార్యులు తెలిపారు. ఇటీవల ఒంటిమిట్టలో జరిగిన సీతారాముల కల్యాణం నేపథ్యంలో శ్రీవారి లడ్డూలు అక్కడకు తరలించడంతో ఇక్కడ విక్రయాలు నిలిపివేశామని.. శనివారం నుంచి యథావిధిగా విక్రయాలు కొనసాగుతాయని పేర్కొన్నారు.

150 మందికి దంత పరీక్షలు

పద్మనాభం: విలాస్కాన్‌పాలెంలో గురువారం నిర్వహించిన ఉచిత దంత వైద్య శిబిరంలో 150 మందికి పరీక్షలు నిర్వహించారు. వైద్యులు ఎ.సాయి ప్రహర్ష, హదస్సా, చాందిని, భావన ఈ పరీక్షలు చేశారు. పీఆర్‌వో ఎస్.శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నాయకులు బోని సన్యాసినాయుడు రామసింగు ముత్యాలనాయుడు పాల్గొన్నారు.

కూటమి పాలనలో పేదల బతుకు భారం

తగరపువలస: కూటమి ప్రభుత్వ పాలనలో పేద ప్రజల బతుకు భారంగా మారిందని సీపీఐ నాయకుడు కానూరు రాంబాబు అన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేర్చనందుకు నిరసనగా తగరపువలస జంక్షన్‌లో గురువారం సీపీఐ కార్యకర్తలు, నాయకులు ర్యాలీ నిర్వహించా రు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్యాస్ బండపై రూ.50 పెంచారని, ట్యాక్సులను పెంచడం వల్ల సామాన్య ప్రజల జీవనం దుర్భరంగా మారిందన్నారు. ఉచిత గ్యాస్ పథకం కింద బండ విడిపించుకున్న వారికి డబ్బులుబ్యాంకు ఖాతాల్లో జమ కాలేదన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీని విస్మరించారన్నారు. సీపీఐ నాయకులు సూరిబాబు, గోవింద, రామకృష్ణ, అప్పారావు, రమేష్, పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన బియ్యం

జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి



హాస్టల్‌లో కిచెన్‌ను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి

మధురవాడ: రాష్ట్రంలోని ప్రభుత్వ హాస్టళ్లకు వచ్చే ఏడాది నుంచి నాణ్యమైన బియ్యం సరఫరా చేస్తామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి చెప్పారు. మధురవాడ కరెంట్ ఆఫీసు పక్కన పూర్తిగా శిథిల స్థితికి చేరిన హాస్టల్ భవనంతో పాటు సాంఘిక సంక్షేమ శాఖ సమీకృత వసతి గృహం, కళాశాల బాలుర వసతి గృహాలను గురువారం ఆయన సందర్శించారు. ఇక్కడ జరుగుతున్న పునరుద్ధరణ, మరమ్మతు పనులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ ప్రీ–మెట్రిక్ బాలుర హాస్టల్‌కు రూ.31 లక్షలు, పోస్ట్–మెట్రిక్ బాలుర హాస్టల్‌కు రూ.29 లక్షలు చొప్పున నిధులు మంజూరు చేశామని, మరమ్మతులు, పునరుద్ధరణ పనులు జరుగుతున్నట్లు చెప్పారు. శిథిల భవనం స్థానంలో కొత్తది నిర్మాణం చేయాల్సి ఉందని, అవసరమైతే అదనపు నిధులు కూడా మంజూరు చేస్తామన్నారు. ప్రస్తుతం ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఉచితంగా డీఎస్సీ కోచింగ్ ఇస్తున్నామన్నారు. ఇప్పటివరకు రాష్ట్రంలో సాంఘిక సంక్షేమ, రెసిడెన్షియల్ స్కూళ్ల మరమ్మతులతో పాటు మరుగుదొడ్ల కోసం రూ.340 కోట్లు ఖర్చు చేశామన్నారు. మధురవాడలోని హాస్టళ్ల చుట్టూ ప్రహరీ నిర్మిస్తామని, ఎదురుగా ఉన్న పార్కు స్థలం పరిరక్షిస్తామని స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, ఆర్డీవో సంగీత్ మాథుర్, సోషల్ వెల్ఫేర్ డీడీ రామారావు, ఏఎస్‌డబ్ల్యూవో రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

మరీ ఇంత బరితెగింపా?

- ప్రభుత్వ స్థలం ఆక్రమణ
- రాత్రికి రాత్రే స్థలం చదును
- భారీ గోతులతో ప్రమాదకర స్థితిలో మెట్ల మార్గం



ప్రమాదకర స్థితిలో మెట్లు

కొమ్మాది: ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించడంతో పాటు భవన నిర్మాణం కోసం పెద్ద ఎత్తున గోతులు తవ్వేడంతో మెట్ల మార్గానికి పెనుప్రమాదం పొంచి ఉంది. వివరాలివి.. 8వ వార్డు సాగర్‌నగర్ దరి ముసలయ్యపాలెంలోని ప్రభుత్వ స్థలంలో గతంలో ఓ సామాజిక భవనాన్ని పలు స్వచ్ఛంద సంస్థల సహకారంతో నిర్మించారు. దానిని స్థానిక ప్రజల అవసరాల కోసం ఉపయోగించుకోవాలనేది నిబంధన. కానీ ఇక్కడ కొందరు నాయకులు ఆ సామాజిక భవనాన్ని కూడా అద్దెకు ఇచ్చి డబ్బు వసూలు చేస్తున్నారు. అంతటితో ఆగలేదు.. ఇప్పుడు ఆ నాయకుల కన్ను ఈ భవనం పక్కన ఉన్న ఖాళీ ప్రభుత్వ స్థలంపై పడింది. ఇంకేముంది రాత్రికి రాత్రే స్థలాన్ని చదును చేయించి సుమారు 25 అడుగుల లోతుకు తవ్వసాగారు. ఆ మట్టిని కూడా అమ్మేశారు.

భారీ తవ్వకాలతో ముప్పు: భారీగా తవ్వేయడంతో ఈ ప్రాంతానికి చేరుకునే ఉన్న మెట్ల మార్గం ప్రమాదకర స్థితికి చేరుకుంది. ఈ స్థలాన్ని ఆనుకుని ఉన్న నివాసాలకు కూడా పెద్ద ముప్పే వాటిల్లనుంది. ఎందుకు తవ్వారని అక్కడ నాయకులను ప్రశ్నించగా.. సామాజిక భవన నిర్మాణం కోసం తవ్వామని, ఓ ఆలయానికి చెందిన ధర్మకర్త ప్రోత్సాహంతో ఇక్కడ తవ్వకాలు చేశామని బహిరంగంగా చెబుతున్నారు. వాస్తవానికి స్థానికులకు ఏదైనా భవనం కావాలంటే స్థానిక ఎమ్మెల్యే దృష్టికో లేక ఉన్నతాధికారులకో అర్జీ పెట్టుకోవాలి. కానీ అదేమీ లేకుండా.. ఇప్పటికే ఒక భవనం ఉన్నప్పటికీ మరో భవన నిర్మాణం కోసం రెవెన్యూ, జీవీఎంసీ అధికారులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా భారీ స్థాయిలో తవ్వేయడం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇంత బరితెగించి నిర్మాణం పేరుతో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించినా, రెవెన్యూ అధికారులకు తెలిసినా అటుగా చూడకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొండపై చిన్న కమ్మల పాక వేసుకుంటేనే వచ్చేసే అధికారులు, ఇంత భారీస్థాయిలో ప్రభుత్వ స్థలం ఆక్రమించినా మౌనం ఎందుకు వహిస్తున్నారనేది ప్రశ్నార్థకం. దీనిపై అధికారులు తక్షణమే చర్యలు తీసుకోకుంటే కలెక్టర్‌ను ఆశ్రయిస్తామని స్థానికులు తెలిపారు.